క్లుప్తంగా

దివ్యాంగులకు పండ్లు పంపిణీ

భీమవరం: పెన్షనర్స్ డే సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సిబ్బంది మంగళవారం కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని అరుణోదయ మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు పండ్లు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అలాగే మనోవికాస కేంద్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం రూ. 10 వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి పుల్లారావు, జి రామ్‌సాగర్, కె పాండురంగారావు, సీహెచ్‌వీ సుబ్బారావు, కేవీవీ సూర్యనారాయణ, కె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు వైద్య సేవలు అందించాలి

పశు సంవర్ధకశాఖ డీడీ డాక్టర్ జవార్ హుస్సేన్



పాడి రైతు మధుబాబుతో మాట్లాడుతున్న పశు సంవర్ధకశాఖ డీడీ హుస్సేన్

సాక్షి స్పందన

కాళ్ల: మూగ జీవాలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని భీమవరం పశు సంవర్ధకశాఖ డీడీ డాక్టర్ జవార్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రమైన కాళ్లలో పశు వైద్యుల నిర్లక్ష్యంతో తమ పశువులు మృత్యువాత పడుతున్నాయంటూ రైతు ఇచ్చిన ఫిర్యాదుపై ‘పేరుకే పశు వైద్యశాల’ అనే శీర్షికతో మంగళవారం సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి పశు సంవర్ధకశాఖ అధికారులు స్పందించారు. భీమవరం పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జవార్ హుస్సేన్ ఆసుపత్రికి వచ్చి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుని ఫిర్యాదు రైతు గనిశెట్టి మధుబాబుతో మాట్లాడారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రైతులతో స్నేహపూర్వకంగా ఉంటూ పశువులకు వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ చంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరంలో 28, 29 తేదీల్లో బాలోత్సవం

భీమవరం: పట్టణంలోని శ్రీచింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్‌లో ఈనెల 28, 29 తేదిల్లో బాలోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎన్నార్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు చెప్పారు. మంగళవారం బాలోత్సవ కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడుతూ 14 అకడమిక్, కల్చరల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలోత్సవంలో పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఈవో ఇందుకూరి ప్రసాదరాజు, పి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ చట్టంపై అవగాహన



జీఎస్టీ చట్టంపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ పి జగదీష్ బాబు

భీమవరం: జీఎస్టీ చెల్లించే వ్యాపారస్తులు అద్దె చెల్లించేటప్పుడు షాపు యజమాని జీఎస్టీ పరిధిలో లేకపోతే 18 శాతం జీఎస్టీగా వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సించాల్సి ఉంటుందని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి జగదీష్ బాబు వివరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం జీఎస్టీ చట్టంలో వచ్చిన మార్పులకు సంబంధించి డీలర్లు, వ్యాపారులు, అకౌంటెంట్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అదే విధంగా సంబంధిత యజమాని జీఎస్టీ పరిధిలో ఉండి ఉంటే వ్యాపారవేత్త ఎటువంటి టాక్స్ కట్టాల్సిన అవసరం లేదని స్పష్టం చేసారు. ఈ విషయాన్ని వ్యాపార వేత్తలు, అకౌంటెంట్లు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు పి రాజేష్ కుమార్, ఎం గంగాధర రావు, డి శ్రీనివాసరావు, ఛాంబర్ అధ్యక్షుడు బొండాడ రామోహన్రావు (రాంపండు),సంగిడి బుజ్జి, కాగిత వెంకటరమణ, పిటిపిఐఎ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేయాలి

పాలకోడేరు: గ్రామ స్వరాజ్యం సాధించాలంటే మౌలిక వసతులు కల్పించడంలో ప్రతి ఉద్యోగి చిత్త శుద్ధితో విధులు నిర్వహించాలని ఎంపీడీఓ వీరమల్లు రెడ్డియ్య అన్నారు. సోమవారం పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాంతీయ గ్రామ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై ఎంపీడీవో వి.రెడ్డియ్య అధ్యక్షతన మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ స్వరాజ్యం సాధించాలంటే మౌలిక వసతుల కల్పనలో ప్రతి ఉద్యోగి పాలు పంచుకోవాలని, అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రహదారి

- ప్రమాదకర స్థితికి చేరిన ఎన్‌హెచ్ 165
- ప్రాణాంతకంగా మారిన లోతైన గుంతలు
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు



ఇటీవల ఈ గుంతల్లోనే పడి ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు



రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

ఉండి: రోడ్డు గుంతలమయం అయితే కొంచెం జాగ్రత్తగా వెళితే సరిపోతుంది. అధ్వానంగా ఉంటే ఆ దారిలో వెళ్లకపోతే సరిపోతుంది. కానీ అందుకు భిన్నమైంది జాతీయ రహదారి 165 పరిస్థితి. ఈ జాతీయ రహదారిపై వాహనదారులు ప్రయాణించాలంటేనే వణికిపోతున్నారు. కారణం ఇరుకైన రహదారి కావడం, అనేక ప్రాంతాల్లో రోడ్డుపై వాహనదారులు గుర్తించ లేనంతగా లోతైన గుంతలు ఉండటం. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్ల యజమానులు ప్రాణాలపై ఆశలు వదులుకుంటున్నారు. ఈ రోడ్డుపై గుంతలు అరడగు నుంచి అడుగు లోతుగా ఉన్నాయంటే ఎంత భయంకరమైన పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు. వాహనదారులు ఈ గుంతల్లో పడి ఎంతో మంది గాయాల పాలవుతున్నారు. మరికొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి ఉదాహరణగా ఇటీవలే కాళ్ల మండలం పెదఅమిరం గ్రామానికి చెందిన ఓ కారు డ్రైవర్ తన డ్రైవింగ్ పని ముగించుకుని ఉండి మీదుగా ఇంటికి వెళుతుండగా ఎన్నార్పీ అగ్రహారం గ్రామ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద హైవేపై ఉన్న లోతైన గుంతల్లో పడి ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కింద పడి తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్యా బిడ్డలు అనాథలుగా మిగిలారు.

అధికారుల నిర్లక్ష్యం

జాతీయ రహదారిపై మట్టి ట్రాక్టర్లు, భారీగా మట్టి లారీలు విపరీతంగా తిరగడంతో రోడ్డుపై తారు కంటే అధికంగా మట్టి ఏర్పడుతుంది. అలాగే పాలకోడేరు మండలం గొరగనమూడిలో హైవేపై విపరీతమైన మట్టి ఉండటంతో పెన్నాడ గ్రామానికి చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనదారుడు జారి పడి కాలు విరగ్గొట్టుకున్నాడు. రోడ్డుపై ఉన్న బంకమట్టిని అధికారులు కూడా గమనించకపోవడం దారుణం. గొరగనమూడి గ్రామ పరిధిలో హైవే అతి చిన్నదిగా ఉండటంతో పాటు ఆక్రమణలు, రహదారిపై గుంతలు ఉండటంతో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు.

వారికి అనిపిస్తేనే గుంత..

రోడ్ల మరమ్మతుల సమయంలో అధికారులు సూచించిన ప్రాంతాల్లోనే రహదారుల మరమ్మతులు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఉండే అధికారి లేదా కాంట్రాక్టర్‌కు ఇది గొయ్యి అనిపిస్తేనే పూడుస్తున్నారు లేదంటే వదిలేస్తున్నారు. ఈ గుంతలు కొద్ది రోజులకే పెరిగి దారుణంగా మారుతున్నాయి.

ప్రమాదకరంగా మారిన ప్రాంతాలు

ఉండిలో ఎన్నార్పీ అగ్రహారం, చెరుకువాడ, ఉండి నిమ్మలపేట సెంటర్, రైల్వే గేటు ప్రాంతం. పాలకోడేరులో గొరగనమూడి, పెన్నాడ. ఆకివీడులో కుప్పనపూడి, అజ్జమూరు, ఆకివీడు శివారు పార్కు వద్ద రహదారి ప్రమాదకరంగా మారింది.

క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి



జాతీయ రహదారిపై ఎన్నో ప్రమాదాలు జరిగి తీవ్ర గాయాలు కావడం, ప్రాణాలు కోల్పోతుంటే సంబంధిత అధికారులు కనీసం క్షేత్ర స్థాయిలో ఎందుకు పర్యటించరు. సమస్యలు తెలుసుకుని అధికారులు పరిష్కరిస్తే ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయి. అధికారులు ఇప్పటికైనా స్పందిస్తే బాగుంటుంది.

-జంపా నాగేశ్వరరావు, ఉండి

ఎక్కడి గోతులు అక్కడే



కొద్ది రోజుల క్రితం జాతీయ రహదారిపై గుంతలు పూడ్చారు. అయితే ఎక్కడి గుంతలు అక్కడే ఉన్నాయి. కాంట్రాక్టర్‌కు అనిపిస్తేనే అది గుంత. లేకుంటే ఎంత పెద్ద గుంత అయినా దానిని పట్టించుకోవట్లేదు. ఇవేమి మరమ్మతులు.

-అంగర రాంబాబు, ఉండి

ప్రత్యేక చర్యలు చేపట్టాలి



జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయని ఎన్నో సార్లు వార్తా పత్రికల్లోనూ, మీడియాలోనూ వస్తున్నాయి. అయితే వాటిని చూసి, చదివిన తరువాత కూడా అధికారులు స్పందించకపోవడం దారుణం. ప్రమాదాలు జరుగుతున్న చోట అధికారులు పర్యటించి ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

-బందెల జార్జ్‌రాజు, చెరుకువాడ

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడికి జైలు

వీరవాసరం: మండలంలోని వీరవాసరం పోలీసు స్టేషన్‌లో ద్విచక్ర వాహనాల దొంగతనాలపై నమోదైన రెండు కేసులకు సంబంధించి భీమవరం మొదటి ఏజేఎఫ్సీఎం కోర్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు వీరవాసరం మండలం మడుగుపోలవరం పంచాయతీ పరిధిలోని జొన్నలపాలెం 1 గ్రామానికి చెందిన వేంద్ర చంద్రశేఖర్‌కు ఒక కేసులో 9 నెలలు, మరొక కేసులో 10 నెలల జైలు రూ.200 జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు ఎస్ఐ ఎం. రాజీకుమార్ మంగళవారం తెలిపారు. ఈ ఏడాది జనవరిలో మండలంలో ద్విచక్ర వాహనాలు అపహరణకు గురయ్యాయంటూ అందిన ఫిర్యాదులతో అప్పటి ఎస్ఐ పి. రమేష్ రెండు కేసులు నమోదు చేశారు. దర్యాప్తు వేగం పెంచి ముద్దాయి చంద్రశేఖర్‌ను గుర్తించి అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు విచారణకు సీఐ బి. శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం. రాజీకుమార్ సహకరించినట్లు కోర్టు కానిస్టేబుల్ పి. నానిబాబు తెలిపారు.

దాసాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



దాసాంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణం మారుతి టాకీస్ సెంటర్ నందు శ్రీ దాసాంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతం, 10 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకము, సాయంత్రం 4 గంటలకు అరటి పండ్ల పూజ, సాయంత్రం 5 గంటలకు లక్ష తమలపాకుల పూజ, సింధూర పూజలను నిర్వహించారు. అనంతరం 7 గంటలకు పుష్పాలంకరణ నీరాజ మంత్ర పుష్పాల కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి గొట్టుముక్కల సీతారామ రాజు తెలిపారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): పాలకోడేరు మండలంలోని విస్సాకోడేరు వంతెన పక్కన ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి నివేదిక సమర్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, భీమవరం నియోజకవర్గం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులుతో కలిసి విస్సాకోడేరు వంతెన పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఎంత విస్తీర్ణం ఉంది, కొలతలు వేసి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు, టౌన్ ప్లానింగ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు భయాన్ని వీడితే ఏదైనా సాధించగలరు

భీమవరం: విద్యార్థినిలు భయాన్ని వీడితే దేనినైనా సాధించగలరని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మిషన్ సాహసి పేరిట ఉన్నత పాఠశాలల విద్యార్థినుల సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలు ధైర్యాన్ని పెంపొందించుకుంటే పురుషులకంటే అనుకున్నది సాధించగలరన్నారు. ఏబీవీపీ పాఠశాల స్థాయిలో సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమం చేపట్టి విద్యార్థినులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం అభినందనీయమన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణనిశాంత్ వర్మ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సాఫ్ట్‌వేర్ దిగ్గజాలు సైతం గ్రామీణ ప్రాంతాల్లోని కళాశాలకు వచ్చి విద్యార్థుల్ని చేర్చుకుంటున్నారని అటువంటి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలంటే ప్రాథమిక దశ నుంచే అన్ని రంగాల్లో విజయాలు అందుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని హర్షికను భూపతిరాజు వెంకటేశ్వరిదేవి ఘనంగా సత్కరించారు. ఈ సదస్సుకు ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ జ్వాలా శ్రీనివాస్ అధ్యక్షత వహించగా కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, అక్షర హాస్పిటల్ వైద్యురాలు ఐశ్వర్య, వీహెచ్‌పీ నాయకురాలు స్వాతిదేవి, చినమిల్లి శివ మంజుష, పి భువనేశ్వరి, ఏబీవీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు జి సాయిసుగ్రీవ, షణ్ముఖ సూర్య ప్రశాంత్, వికాస్ కన్వీనర్ దిన్ను చందు, వెంకట్ దుర్గసాయి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌కేఆర్‌లో విద్యార్థి హర్షికను సత్కరిస్తున్న దృశ్యం

జేడీ కార్యాలయానికి వెళ్లాలంటే ముక్కుమూసుకోవాల్సిందే



భీమవరం కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ జేడీ కార్యాలయం దృశ్యం

భీమవరం: భీమవరం కలెక్టరేట్‌లోని ప్రధానమైన జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలోనికి ముక్కుమూసుకుని వెళ్లాల్సిందే. వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్(జేడీ)కి కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేకంగా గదిని కేటాయించారు. కార్యాలయం పక్కనే మరుగుదొడ్లు ఉండడంతో దుర్వాసనతో ముక్కుపుటాలు అదిరిపోతాయి. జేడీ వద్దకు నిత్యం అనేకమంది రైతులు, వ్యవసాయశాఖ అధికారులు, ఎరువులు, పురుగుమందుల విక్రేతలు వస్తుంటారు. కార్యాలయం లోపల సుందరంగా ఆకర్షనీయంగా ఉన్నప్పటికీ ప్రవేశద్వారం పక్కనే మరుగుదొడ్లు ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీనితో జేడీ కార్యాలయానికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా జేడీ కార్యాలయం వద్ద మరుగుదొడ్లు తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని లేకుంటే దుర్వాసన లేకుంటే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంధన పొదుపుతోనే భవిత



భీమవరంలో విద్యార్థులకు పోటీల మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భావితరాల కోసం ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. భీమవరం పట్టణంలోని సీవీ రామన్ స్కూల్లో మంగళవారం విద్యుత్ పొదుపు వారోత్సవాలలో భాగంగా శ్రీవిజ్ఞానవేదిక సహకారంతో విద్యుత్ శాఖ అధ్వర్యంలో అవగాహన సదస్సు, విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ కె రాంబాబు మాట్లాడుతూ అవసరం మేరకు మాత్రమే విద్యుత్‌ను వినియోగించాలని, ఎల్ఈడీ, సోలార్ బల్బులు వినియోగం వల్ల విద్యుత్తు ఆదా అవుతుందన్నారు. అనంతరం ఇంధన పొదుపుపై విద్యార్థులకు పోటీలు నిర్వహించేందుకు మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, పి పద్మ, కె రాము, ఎం శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు



మహిళా రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్

వీరవాసరం: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రైతులకు సూచించారు. మంగళవారం వీరవాసరం మండలం కొణితవాడ గ్రామంలో కోడి మంగమ్మ మహిళా రైతు వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీరు పండించిన పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా రైస్ మిల్లులకు విక్రయించుకోవాలని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు.

ఉండి:గ్రామంలోని రైతుసేవా కేంద్రాల ద్వారా గోనె సంచులు రైతులకు అందుబాటులో ఉంచామని, దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం యండగండిలో రోడ్డు పక్కనే ధాన్యం ఆరబోసుకున్న రైతులతో మార్గమధ్యంలో జేసీ రైతులతో మాట్లాడారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్ముకోవాలని రైతులకు సూచించారు.

ఎఫ్ఎంబీ ప్రకారమే రీసర్వే చేయాలి



అల్లూరి సోమరాజు, ఆదర్శ రైతు

ఆకివీడు: భూముల రీసర్వే లోప భూయిష్టంగా ఉందని ఆదర్శ రైతు అల్లూరి సోమరాజు ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రీసర్వే ఆర్ఎస్ఆర్ లేదా ఎఫ్ఎంబీ ప్రకారం చేయాలని సూచించారు. రైతులు, ప్రజలు సర్వే సక్రమంగా జరగలేదని, ఆ సర్వే సరి కాదని గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి, తహసీల్దార్‌కు ముక్త కంఠంతో చెప్పామన్నారు. రికార్డుల ప్రకారం సర్వే జరగలేదని, ఎల్‌పీ నెంబర్‌ను ప్రాతిపదికగా తీసుకుని సర్వే చేయడం ఎంత వరకూ సమంజసమని ఆయన ప్రశ్నించారు. రీ సర్వేను నిలుపుదల చేసి, పాత రికార్డుల ప్రకారం అడంగళ్లను యధావిధిగా ఉంచి నట్‌లైయితే ఏ విధమైన ఫిర్యాదులు రావని సోమరాజు చెప్పారు. డ్రోన్ సర్వేను తప్పు పట్టడం లేదని, అయితే రికార్డుల ప్రకారం డోన్ సర్వే ఉండాలన్నారు. ఇప్పటికే భూమి ఉన్న వారికి భూమి లేదని, ఉన్న భూమి కంటే అదనపు భూమిని చూపించి సర్వే చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కోలాహలంగా నందమూరి గరువు తిరునాళ్ల

మండలంలో నందమూరి గరువలో శ్రీరామ భక్తాంజనేయ స్వామి 59వ వార్షిక మహోత్సవాల తిరునాళ్లు కోలాహలంగా నిర్వహించారు. పిల్లలు, యువతీ యువకులు ఈ తిరునాళ్లలో సందడి సందడి చేశారు. మంగళవారం సాయంత్రం భక్తాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్, కొలంబస్, డ్రాగాన్ ట్రెయిన్, రంగుల రాట్నాలు ఆకర్షణీయంగా నిలిచాయి. వాటిని యువత, చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఎక్కి కేరింతలు కొడుతూ సంతోష పడ్డారు. వివిధ దుకాణాల వద్ద గృహ ఉపకరణాలు, గాజులు, కర్ర బొమ్మలు, స్టీల్ వస్తువులు, పిల్లలు ఆడుకునేందుకు వీలైన వివిధ ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో పట్టణవాసులే కాక గ్రామీణ ప్రాంతాల నుంచి గృహిణులు, పిల్లలు, పెద్దలు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. ఆనందోత్సవాల మధ్య నందమూరి గరువ తిరునాళ్లు కొనసాగుతున్నాయి.

-వీరవాసరం



తిరునాళ్లలో సందడి చేస్తున్న చిన్నారులు



తిరునాళ్లలో దుకాణాల వద్ద సందడిగా జనం



జెయింట్‌వీల్

రైతుల అభివృద్ధికి కృషి చేస్తా



ఆకుల లీలాకృష్ణమూర్తిని అభినందిస్తున్న దృశ్యం

వీరవాసరం: రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఆకుల లీలా కృష్ణ మూర్తి తెలిపారు. ఆకుల లీలా కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మంగళవారం వీరవాసరం మండల రెవెన్యూ కార్యాలయం నుంచి మత్స్యపురి ఆకుల లీలాకృష్ణ మూర్తి ఇంటి వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, భీమవరం నియోజకవర్గ శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు, కొటికలపూడి గోవిందరావు, తోట సీత మహాలక్ష్మి, నీటి సంఘాల అధ్యక్షుడు, రైతులకు, సభ్యులను, కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు చోటులేని నీటి సంఘాలు



నంద్యాల చల్లారావు

ఆకివీడు: రైతులకు చోటు లేకుండా నీటి సంఘాల కమిటీలు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు ఆరోపించారు. మండలంలోని కుప్పనపూడిలో ఆయన పొలం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత నీటి సంఘాల వల్ల రైతులకు ఏ విధమైన ఉపయోగం ఉండదన్నారు. పార్టీలో ఉన్న వ్యాపారస్తులకు, రొయ్యలు, చేపల చెరువులకు చెందిన వారికి నీటి సంఘాల్లో స్థానం కల్పించారని ఆరోపించారు. బోదె, కాలువ ఎక్కడుందో తెలియని వారు, డ్యాములు, లాకులు అంటే తెలియని వారికి సంఘంలో స్థానం కల్పించారన్నారు. నిత్యం పొలం గట్టుపై తిరుగుతూ సాగు నీరు, మురుగునీటి పారుదలపై అవగాహన ఉన్న రైతులను వేళ్లపై లెక్కించవచ్చునన్నారు. గత పదేళ్లుగా పంట, మురుగు కాల్వలు అధ్వానంగా తయారయ్యాయని, దుక్కి వర్షానికే పంటలు నీట మునుగుతున్నాయని, దాళ్వా సాగుకు నీరు అందని పరిస్థితి నెలకొంటుందని చల్లారావు వాపోయారు. నీటి సంఘాల ఏర్పాటు పారదర్శకంగా లేదని ఆయన విమర్శించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

వీరవాసరం: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తెలిపారు. వీరవాసరం మండలం నవుడూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఏ చిన్న సమస్య వచ్చినా రెవెన్యూ సిబ్బందిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సదస్సులో ఏడు అర్జీలు వచ్చాయని వివరించారు.